సాక్షి
పల్నాడు
మంగళవారం । 26 । మార్చి । 2024



ముగిసిన దుర్గమ్మ తిరునాళ్లు

తెనాలిటౌన్: పట్టణ బాలాజీరావుపేటలోని ప్రధాన అయ్యప్ప దేవాలయంలో జరుగుతున్న దుర్గమ్మ తిరునాళ్లు సోమవారంతో ముగిశాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కల్యాణ మహోత్సవం

దుర్గి: దుర్గిలో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
నరసరావుపేట	6.27	4.53
గుంటూరు	6.25	4.51
బాపట్ల	6.25	4.51

న్యూస్‌రీల్

బీటీ పత్తి విత్తన ధరలు ఖరారు

కొరిటెపాడు(గుంటూరు): బీటీ పత్తి విత్తన ప్యాకెట్ల ధరలను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. బీటీ–1 విత్తనాల ధరలు కొన్నేళ్లుగా నిలకడగా ఉండగా.. బీటీ–2 పత్తి విత్తనాల ధరలను పెంచుతోంది. విత్తనాలను 450 గ్రాముల ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఇందులో 25 గ్రాములు నాన్ బీటీ పత్తి విత్తనాలు ఉంటాయి. 450 గ్రాముల బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్ ధర 2023–24లో రూ.853 ఉండగా, 2024–25 సంవత్సరానికి ప్యాకెట్ ధరను రూ.864లకు పెంచినట్లు స్పష్టమవుతోంది.450 గ్రాముల ప్యాకెట్‌పై రూ.11 పెరిగింది. బీటీ–1పత్తి విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర నిలకడగా రూ.635 ఉంది.

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్య ఊరేగింపు



పాతగుంటూరు:కొరిటెపాడు ఆంజనేయపేటలోని లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల వారి తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నేల పొంగళ్లు స్వామి అమ్మవార్లకు నివేదించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, గణపతి హోమం, పోతురాజు స్వామికి నీళ్లు పోసే కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పురవీధులలో ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమాలను కన్నసాని విజయకుమార్, రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

వియత్నాం మీడియా ప్రతినిధులు సాగర్ సందర్శన



నాగార్జునసాగర్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను సోమవారం వియత్నాం దేశ మీడియా ప్రతినిధులు సందర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జర్నలిజం–పబ్లిక్ రిలేషన్స్ అనే అంశంపై వియత్నాం మీడియా ప్రతినిధులకు శిక్షణ నిర్వహిస్తున్నారు. వియత్నాం, ఇండియా ఆర్థిక సహకారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, నాగార్జునకొండ మ్యూజియం, సాగర్ డ్యాం తదితర ప్రాంతాలను సందర్శించారు. వీరి వెంట టూరిజం గైడ్ సత్యనారాయణ, తెలంగాణ అధికారులు ఉన్నారు.

ఇద్దరు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సస్పెన్షన్

పెదనందిపాడు(కాకుమాను): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేయని పనులకు ఎఫ్‌టీఓలు మంజూరు చేసిన విషయంలో పెదనందిపాడు ఉపాధి హామీ ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్, అసిస్టెంట్ అకౌంటెంట్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎంపీడీఓ స్వామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకంలో ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీపతి, కంప్యూటర్ ఆపరేటర్ రాజ్యలక్ష్మి కలసి ఉపాధి హామీ పథకం ద్వారా చేయని పనులకు ఎఫ్‌టీఓలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నివేదిక మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఇరువురిని విధుల నుంచి తొలిగిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

వేద స్మార్త పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో వేద స్మార్త పాఠశాల ఐదో బ్యాచ్ అడ్మిషన్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ వానపాముల రత్నాచార్యులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. తెలుగు చదవటం, రాయటం వచ్చిన వారు అర్హులు అని, వయస్సు 12 నుంచి 15 లోపు ఉండాలన్నారు. విశ్వ బ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తు చేసువాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఉచిత భోజనం, వసతి, దుస్తులు ఇవ్వబడతాయన్నారు. ఇతర వివరాలకు వీరబ్రహ్మేంద్ర స్మార్త వేద పాఠశాల, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా, ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ వానపాముల రత్నాచార్యులు 9848442598, బ్రహ్మశ్రీ సిద్ధి హరి ఆచార్య 9963386690, నిర్వాహకులు బ్రహ్మశ్రీ చింతాడ సూర్యప్రకాష్, కాంటాక్ట్ 9491612324 నంబర్లలో సంప్రదించాలన్నారు.



రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్త జన సందోహం

భక్తజన కీలాద్రి మంగళాద్రి

- మంగళాద్రి తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన మంగళగిరి వీధులు
- వైభవంగా నృసింహుని దివ్య రథోత్సవం
- జై నారసింహ..జైజై నారసింహ నినాదాలతో మారుమోగిన వీధులు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి వారి దివ్య రథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దివ్య మంగళ స్వరూపుడైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో మంగళాద్రి కిటకిటలాడింది. ఆదివారం రాత్రి అంగరంగవైభవంగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహించుకున్న స్వామి వారు సోమవారం ఉదయం బంగారు గరుడోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం బ్రాహ్మణ సమారాధనం అనంతరం మూడు గంటలకు ఉభవ దేవేరులతో స్వామి వారు దివ్య రథాన్ని అధిరోహించారు. అలంకరణ, పూజల అనంతరం 3 గంటల 35 నిముషాలకు స్వామి వారి దివ్య రథం భక్తుల గోవిందనామ్మ స్మరణతో మారుమోగుతూ బయలుదేరగా జై నారసింహ..జైజై నారసింహ అనే నినాదాలతో మంగళాద్రి భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. గాలి గోపురం వద్ద హారతితో బయల్దేరిన రథోత్సవం మెయిన్‌బజార్‌లోని మిద్దె సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు చేరుకుని అక్కడ పూజల అనంతరం తిరిగి అదే మెయిన్‌బజార్‌లో గాలి గోపురం వద్దకు చేరుకుంది. భక్తులు భారీగా తరలి రావడంతో పలురోడ్లు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' దక్షిణాభి ముఖముగా రథారూఢుడై పయనించి కేశవుని. శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించిన వారికి మరలజన్మ ఉండదని శాస్త్ర ప్రమాణం. కావున అత్యంత వైభవంగా జరుగు రథోత్సవంలో లక్షలాది భక్తులు పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాఢభూషి వేదాంతచార్యులు వ్యవహరించగా ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి ఉత్సవాన్ని ప్రారంభించి పర్యవేక్షించారు. స్వామి వారిని గుంటూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కిలారు రోశయ్య, మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవంలో పాల్గొన్నారు.



అలంకరణలో పానకాల లక్ష్మీనృసింహస్వామి

రంగుల హోలీ

- బంజారా మహిళల నృత్యాలు
- ఉత్సాహంగా హోలీలో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: హోలీ వేడుకలు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్, 3వ వార్డు కౌన్సిలర్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని 3వ వార్డులో సోమవారం జరిగిన హోలీ వేడుకల్లో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలు భారీ సంఖ్యలో ఎదురెళ్లి మంత్రి అంబటికి హారతులు పట్టారు. ప్రతి ఇంటి వద్ద అంబటి రాంబాబుకి రంగు పూసి మహిళలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఉట్టి కొట్టి సంతోషపు రంగులను విరజిమ్మారు. బంజారా మహిళల సంప్రదాయ కోలాటం, సంప్రదాయ నృత్యాల్లో వారితో కలిసి నృత్యం చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి గెలిచే సంప్రదాయ ప్రతీక హోలీ పండుగ అన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా చెడుపై మంచి గెలుస్తుందని, మీరందరూ ఆశీర్వదిస్తే ఇది సాధ్యమేనన్నారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబును పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ నాయకులు డాక్టర్ సయ్యద్ సలీం, షేక్ మొహమ్మద్ గని, హైదరాబాద్ సుభాని, తోట లక్ష్మీనారాయణ, శిరిగిరి వెంకట్రావు, హనీఫ్, నాయకులు, కార్యకర్తలు, బంజారా మహిళలు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా యువకులు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున హోలీ వేడుకలు జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



సత్తెనపల్లిలో ఉట్టి కొడుతున్న మంత్రి అంబటి రాంబాబు

వైభవంగా కోదండ రామాంజనేయస్వామి ప్రతిష్ట

అనిల్‌కుమార్ యాదవ్, కాసు మహేష్‌రెడ్డి పూజలు

పిడుగురాళ్లరూరల్: మండలంలోని కరాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతా సమేత కోదండ రామాంజనేయ, వినాయక, ఆంజనేయ, జీవ ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టా మహోత్సవం సోమవారం కనుల పండుగగా జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రాణప్రతిష్ట చేసిన దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సౌఖ్యాలతో, చల్లగా ఉండేలా దీవించాలని స్వామివారిని వేడుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, సర్పంచ్ చల్లా శివారెడ్డి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, సత్తార్ సీతారామిరెడ్డి, ఎంపీటీసీ గురవారెడ్డి, నెల్లూరి వెంకట్రామిరెడ్డి, బాషా, వలి, మాదాల జగన్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి సన్నిధిలో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు

పోలీసుల విస్తృత తనిఖీలు



నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

- పార్టీలకతీతంగా విధులు
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి వాహనం తనిఖీ
- సానుభూతి కోసం లోకేష్ ప్రయత్నాలు

తాడేపల్లిరూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కృష్ణా, గుంటూరు జిల్లా సరిహద్దు అయిన ప్రకాశం బ్యారేజ్ వద్ద 10 రోజులుగా విస్తృత తనిఖీలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆదివారం నారా లోకేష్ కారును తనిఖీ చేయడంతో ఆయన అసహనం వ్యక్తం చేస్తూ తాడేపల్లి ప్యాలెస్ నుంచి తనిఖీలు చేయమన్నారా? ఇదేవిధంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల వాహనాలు తనిఖీ చేస్తున్నారా అంటూ చిందులు తొక్కారు. విధుల్లో ఉన్న ఎస్ఐ ప్రతి ఒక్క వాహనం తనిఖీ చేస్తున్నామని చెప్పినా వినకుండా పోలీసులను భయభ్రాంతులకు గురిచేశారు. వాస్తవానికి ఆ సమయంలో నరసరావుపేట వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి. అనిల్‌కుమార్‌యాదవ్ కాన్వాయ్‌ను ఆపి తనిఖీలు చేశారు. తనిఖీల అనంతరం నారా లోకేష్ తాడేపల్లిలో ఏర్పాటు చేసిన సభలో ప్రజల సానుభూతి లభిస్తుందని ప్రతిసారి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నన్ను, నా కారును ఆపి తనిఖీలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఎన్నికల అనంతరం వారి సంగతి తేలుస్తానంటూ ఒక పక్క తన మీద సానుభూతి కురిపించుకుంటూ మరో పక్క ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ పంపిస్తున్నారు. పోలీసులను ఇప్పుడు కనుక తమదైన శైలిలో బెదిరిస్తే రాబోయే కాలంలో తన కారును తనిఖీ చేయరని, తమ కారులోనే వార్డుల వారీగా డబ్బుల మూటలు పంపించవచ్చని ఆలోచనతో లోకేష్ టీడీపీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొడుతున్నారనే భావన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 513.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 810.80 అడుగుల వద్ద ఉంది.

మానవాళికి మార్గదర్శి పవిత్ర ఖురాన్

- 30 భాగాలుగా విభజన
- చదువు విలువను తెలియజేసిన గ్రంథం
- మహిళల హక్కుల గురించి ప్రస్తావన

చిలకలూరిపేట: ప్రపంచంలోని ముస్లింలందరికీ నెలరోజుల పండుగ రంజాన్. దివ్యఖురాన్ దైవం నుంచి భువికి అవతరించిన మాసం కూడా ఇదే. ఈ పవిత్ర గ్రంథం వెలుగులో ఆత్మ ప్రక్షాళన చేసుకొనే అవకాశం కల్పిస్తుంది. సాఫల్య జీవితానికి సోపానం దివ్య గ్రంథం పవిత్ర ఖురాన్ అల్లా నుంచి అవతరించి భూమిపైకి వచ్చిన గ్రంథం కావటంతో దీనికి దివ్యఖురాన్ అంటారని మౌల్వీలు పేర్కొంటున్నారు. మానవుడు ఉన్నత జీవితం గడిపేందుకు అవసరమైన అన్ని సూచనలు, నియమాలు ఇందులో పొందుపరిచి ఉన్నాయి. ప్రాపంచిక విషయాల్లో ఎదురయ్యే ఎలాంటి ఒడిదుడుగులకైనా ఈ గ్రంథంలో పరిష్కార మార్గం ఉంటుంది. మానవ సంబంధాలు, శాంతియుత జీవనం, అహింస, విశ్వసనీయత, సౌభ్రాతృత్వం, ఎవరితో ఎలా మసలుకోవాలి, ఏ సమస్యను ఎలా పరిష్కరించాలి, నిత్య జీవితం ఎలా గడపాలి, పిల్లలతో ఎలా ఉండాలి, పెద్దలతో ఎలా నడుచుకోవాలి, సాటివారితో ఎలా మసలుకోవాలి వంటి ఇహలోక అంశాలతోపాటు పరలోక సౌఖ్యం పొందటానికి అవసమైన మూలసూత్రాలు ఇందులో పొందుపరిచి ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇహ, పరలోకాల సౌఖ్యం, సాఫల్య జీవితానికి మూల సూత్రాలే దివ్య గ్రంథంలోని ప్రధాన అంశాలు. పవిత్ర ఖురాన్‌లో సూచించిన మార్గాన్ని మహమ్మద్ ప్రవక్త అనుసరించారు. ఈ లోకానికి ఆచరించి చూపారు. దివ్య ఖురాన్ రంజాన్ మాసంలో అవతరించటంతో ముస్లింలు ఈ మాసంలో ఖురాన్‌ను పఠిస్తూ దాని పవిత్రతను చాటుతుంటారు. ఖురాన్‌లో 114 సూరాలు, 6,666 ఆయాత్‌లు, 540 రుకూలు ఉంటాయి. సంపూర్ణ గ్రంథాన్ని 30 భాగాలుగా విభజించారు. వాటిని పారాలుగా పేర్కొంటారు. రంజాన్ మాసంలో తరావి నమాజు కింద పూర్తి పఠనం గావిస్తారు. అవతరించిన నాటి నుంచి చిన్న మార్పు కూడా లేని గ్రంథంగా ప్రాచుర్యం పొందింది.



ఖురాన్ పఠిస్తున్న ఇమామ్

సన్మార్గ దర్శిని

దైవం దివ్య ఖురాన్‌ను ప్రపంచమానవాళికి మహిమాన్విత వరంగా ప్రసాదించారు. అజ్ఞానపు కారు చీకట్ల నుంచి విజ్ఞానమనే వెలుగు బాటను చూపిన ఈ దివ్య గ్రంథం మానవుడి అవివేకాన్ని తుడిచిపెట్టేందుకు ఉత్తమమైన మార్గంగా నిలుస్తోంది. మామూలు వ్యక్తిని కూడా మహోన్నతునిగా మార్చేందుకు దోహదపడుతుంది. ఈ దివ్య గ్రంథంలో మొత్తం 30 భాగాలు ఉంటాయి. మొదటి భాగం 'ఎఖ్రా' (విద్య) సంబంధించినది. దీని ద్వారా ముస్లింలకు చదువు తప్పనిసరి అనే సూచన అందుతోంది. చదువు విలువను ఈ దివ్య గ్రంథంలోనూ ఈ భాగం ద్వారా తెలుసుకోవచ్చు. మనిషిని ఉత్తముడిగా మార్చేందుకు ఈ దివ్య గ్రంథంలో ఎన్నో సూచనలు ఉన్నాయి. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించాల్సిన విధుల గురించి ఈ సూచనలు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఈ మాసంలో ధనికులు జకాత్, ఫిత్రాలను ఖచ్చితంగా అందజేస్తే రంజాన్ ఈద్ ప్రార్థన సమయానికి పేదలనే వారు ఉండరని ఈ గ్రంథం వివరిస్తుంది. మానవుడిలోని మద్యం, వ్యభిచారం, పాపం, ద్రోహం, హింస, చెడుగా మాట్లాడటం, కించపరచాలనుకోవటం వంటి విషయాలను ఈ గ్రంథం తీవ్రంగా నిరసిస్తుంది. నైతిక విలువలతో జీవించాలని ప్రబోధిస్తుంది. ముఖ్యంగా స్త్రీలను బానిసలుగా చూడకూడదని, పురుషులతో సమానంగా అన్ని హక్కులు కల్పించాలని, వాటి రక్షణ బాధ్యత పురుషుడే వహించాలని సూచిస్తుంది. అనాథలు, వితంతువులకు సహాయకారులుగా ఉండాలని చెబుతుంది.

శాస్త్రీయమైనది

దివ్య ఖురాన్ గ్రంథం ఎంత పవిత్రమైనదో అంత శాస్త్రీయమైనది కూడా అని ప్రపంచ మేధావులు కొనియాడుతున్నారు. ఇందులో అణువణువునా శాస్త్రీయత నిండి ఉందని, దానికి ప్రకృతే ఉదాహరణ అని పేర్కొంటున్నారు. ప్రకృతిలో చెట్టు ఎంత విలువైనదో ఈ గ్రంథంలోని కొన్ని చోట్ల ప్రస్తావించబడి ఉంటుంది. మానవాళికి చెట్టు ఎంత ఉపయోగపడుతుందో కూడా ఈ గ్రంథంలో వివరింపబడింది. ఖురాన్‌ను చదివి దానిని అమలు పరిచే వారికి స్వర్గలోక ప్రాప్తి లభిస్తుందని మౌల్వీలు చెబుతారు. పఠించేవారికి ప్రశాంతతోపాటు మనశ్శాంతి లభిస్తుందని విశ్వాసుల నమ్మకం.

దివ్యకాంతి పుంజం



దివ్య ఖురాన్ సాధారణ గ్రంథం కాదు. ఇది దైవం మనకు ప్రసాదించిన దివ్యమైన కాంతిపుంజం. దాని పవిత్రతను తెలుసుకొని ఆచరించి ఆరాధిస్తే దైవం ద్వారా మనకు స్వర్గం ప్రాప్తిస్తుంది. ఈ పవిత్ర రంజాన్ మాసంలో పఠించటం ముఖ్యమే అయినా జీవితాంతం క్రమం తప్పకుండా పఠించటం ముక్తిదాయకం. ఖురాన్‌ను నేర్చుకుంటూ, ఇతరులకు నేర్పేవారు ఈ భూమిపై అందరికంటే ఉన్నతులు.

–మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్‌నద్వి

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- కలర్ ఫుల్ ఎలక్షన్–2024పై అవగాహన
- ఓటర్లకు పలు రకాల పోటీలు
- విజేతలకు బహుమతులు పంపిణీ

మంగళగిరి: ఓటింగ్ 100 శాతం సాధించడమే లక్ష్యంగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు హోలి సందర్భంగా కలర్‌ఫుల్ ఎలక్షన్–2024 కార్యక్రమం నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించినట్లు నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి తెలిపారు. పట్టణంలోని మిద్దె సెంటర్‌లో ఉన్న సీకే జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం హోలిని పురస్కరించుకుని కలర్ ఫుల్ ఎలక్షన్ –2024 నిర్వహించారు. రాజకుమారి మాట్లాడుతూ నియోజకవర్గంలో 300 పోలింగ్ బూత్‌లు 2,89,940 మంది ఓటర్లు ఉన్నారన్నారు. గత ఎన్నికలలో సీకే కళాశాలలోని 180 పోలింగ్ కేంద్రంలో అతి తక్కువగా పోలింగ్ శాతం నమోదైందని, కేంద్రం పరిధిలోని ఓటర్లకు అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఓటు విలువను తెలియజేస్తూ మహిళలు వేసిన ముగ్గులు ఆలోచింపచేశాయని, ఓటరుగా నమోదైనందుకు గర్వపడుతున్నాను ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకుంటాను, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతాను అనే నినాదంతో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటరుగా నమోదు అయినందుకు గర్వపడుతున్నాను అనే నినాదాలతో కుర్చీలాట(మ్యూజికల్ చైర్), ముగ్గులు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఓటర్లతో కలిసి హోలి సంబరాలలో పాల్గొన్నారు. జేసీ హోలి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ వి నిర్మల్‌కుమార్, అడిషనల్ కమిషనర్ ఎస్ ప్రకాశరావు, అసిస్టెంట్ కమిషనర్ బి శివారెడ్డి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జేసీ రాజకుమారి

క్లుప్తంగా

టీడీపీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం

- టీడీపీ నాయకుడిని స్టేషన్‌కు తరలించడంతో వివాదం
- పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన టీడీపీ నాయకులు

కారెంపూడి: టీడీపీ నాయకులు, పోలీసుల మధ్య సోమవారం రాత్రి జరిగిన వాగ్వాదం ఉద్రిక్తతకు దారి తీసింది. టీస్టాల్ వద్ద గుంపుగా టీ తాగుతున్న టీడీపీ నాయకులను గుర్తించిన సీఐ చినమల్లయ్య ఇక్కడ ఇంతమంది ఎందుకున్నారంటూ ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్కడ నుంచి వెళ్లమని హెచ్చరించడంతో వివాదం ప్రారంభమైంది. టీ తాగి వెళతామని టీడీపీ నాయకులు సీఐకి బదులిచ్చారు. ఐపీఎల్ జరుగుతున్నందున బెట్టింగులకు పాల్పడుతున్నారనే అనుమానాలున్నాయని సీఐ వారిని హెచ్చరించడంతో టీడీపీ నాయకులు, సీఐకి మధ్య వాదోపవాదాలు జరిగాయి. సీఐ ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సమయంలో ఎస్ఐ రామాంజనేయులు రంగ ప్రవేశం చేసి గుంపును చెదరగొట్టి సీఐతో వాదనకు దిగావంటూ టీడీపీ నాయకుడు చప్పిడి రామును స్టేషన్‌కు తరలించారు. దీంతో సుమారు 150 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తామేమీ బెట్టింగులకు పాల్పడడం లేదని ఆధారాలుంటే చర్యలు తీసుకోవచ్చని టీడీపీ నాయకులు వాదనకు దిగారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని పోలీస్‌శాఖకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. తర్వాత చప్పిడి రామును సీఐ స్టేషన్ నుంచి పంపి వేయడంతో వివాదం సద్దుమణిగింది.

కారకులను కఠినంగా శిక్షించాలి

తెనాలి: అన్నమయ్య జిల్లా, ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరం గ్రామానికి చెందిన చేనేత కుటుంబసభ్యులు పాల సుబ్బారావు, ఆయన భార్య, కుమార్తె మరణాలకు కారకులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఆ సంఘటన మొత్తంపై సమగ్రమైన న్యాయవిచారణ జరిపించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పాల సుబ్బారావు కుటుంబానికి చెందిన భూమిని వారికి కాకుండా తారుమారు చేయడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన వారిపై సెక్షన్ 306 ఐపీసీ కింద కేసు నమోదు చేయాలన్నారు. పెద్ద కుమార్తె లక్ష్మీప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. లక్ష్మీప్రసన్నతో సోమవారం ఫోనులో మాట్లాడిసానుభూతి తెలియజేశామన్నారు.

కాలేయం.. అనుక్షణం 'బాడీ' గార్డు

- పెరుగుతున్న కాలేయ వ్యాధి బాధితులు
- ఆధునిక జీవనశైలితో అనర్థాలు
- పిల్లలకు లివర్ క్యాన్సర్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం



గుంటూరు మెడికల్: కాలేయం (లివర్) మన శరీరంలో అతి పెద్ద గ్రంథి. అది సక్రమంగా పని చేయకపోతే అనేక రోగాలు శరీరాన్ని చుట్టుముడతాయి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు పలువురు లివర్ వ్యాధుల బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మన దేశంలో అత్యధిక సంఖ్యలో బారిన పడుతున్నారని వెల్లడించింది. లివర్ వ్యాధులపై ప్రజలకు అవగాహన లేకపోతే తీవ్ర అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

పెరిగిన బాధితుల సంఖ్య

జిల్లాలో 15 మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఉండగా.. ప్రతి రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ఐదుగురు లివర్ సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగానికి 20 మందికి పైగా బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

లివర్ చేసే పనులు

ఉదరంలో ఉదరవితానికి కిందగా కుడి వైపున మధ్యలో కాలేయం ఉంటుంది. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయడం, జీర్ణక్రియకు దోహదపడే పైత్యరసాన్ని ఉత్పత్తి చేయడంతో పాటు శరీరంలోని కొవ్వు, చక్కెర, ప్రొటీన్ శాతాన్ని నియంత్రిస్తుంది. శరీరం జబ్బు బారిన పడకుండా రక్షణ కల్పిస్తుంది. రక్త శుద్ధితో పాటు శరీరంలోని విషాలను హరించడం చేస్తుంది. మనలో ప్రవేశించే హానికర పదార్థాలను తొలగించడం, ఆహారాన్ని శక్తి రూపంలోకి మార్చడం చేస్తుంది. వివిధ హార్మోన్ల విడుదలను నియంత్రణలో పెట్టడం, రక్తం గడ్డకట్టడానికి, గాయాలు త్వరగా మానడానికి కావాల్సిన ఎంజైమ్స్‌ను ఉత్పత్తి చేయడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుంది.

కాలేయ సమస్యలకు ముఖ్యకారణాలు

మత్తు పదార్థాలు సేవించడం, పొగ తాగడం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, ఇన్‌ఫెక్షన్స్ వల్ల కాలేయ సమస్యలు వస్తాయి. లైంగిక సంబంధాలు, ఒకరికి వాడిన సూదిని మరొకరికి వాడటం వల్ల హెపటైటిస్ బీ, సీ వ్యాధులు సోకుతాయి. కలుషిత రక్తమార్పిడి, కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల హెపటైటిస్ ఏ, ఈ వ్యాధులొస్తాయి. శారీరక వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం వల్ల కొవ్వు పెరిగి కాలేయంపై పేరుకుపోతుంది. నూనె వస్తువులు ఎక్కువగా తినటం, పిజ్జాలు, బర్గర్స్‌లు, ఫాస్ట్‌ఫుడ్ వల్ల లివర్ వ్యాధులు వస్తాయి. శరీరానికి హానిచేసే మందులు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా కాలేయ సమస్యలు తలెత్తుతాయి. మన రోగ నిరోధక శక్తి మనవైపే ప్రతికూలంగా పనిచేయటానికి అవకాశం ఉన్నప్పుడు , వంశపారంపర్యంగా కాలేయ వ్యాధులు వస్తాయి. తెల్లగా ఉండే కళ్లు పసుపు పచ్చగా, గోళ్లు పసుపు రంగులో మారితే కామెర్ల సమస్యలు ఉన్నట్లు భావించి వైద్యపరీక్షలు చేయించుకోవాలి.

కాలేయాన్ని కాపాడుకోవాలి



అల్కాహాల్ వల్ల లివర్ దెబ్బ తింటుంది కాబట్టి మద్యం జోలికి వెళ్లవద్దు. కొవ్వు పదార్థాలు, వేపుళ్లు అతిగా తినవద్దు. ఉప్పు, చక్కెర, రెడ్ మీట్ ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు. పచ్చని ఆకు కూరలు తినడం వల్ల లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి. ఆలీవ్ ఆయిల్స్, వాల్‌నట్స్, గ్రీన్ టీ, ఆపిల్ పండ్లు, వెల్లుల్లిపాయలు, పసుపు లివర్‌కు మేలు చేస్తాయి. విటమిన్ సీ ఎక్కువగా తీసుకుంటే కాలేయం వద్ద పేరుకుపోయే కొవ్వును నియంత్రణ చేస్తుంది. రోజూ నీటిని ఎక్కువగా తాగటం వల్ల కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

–డాక్టర్ యడ్ల హనుమాన్‌ప్రసాద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు.

అత్యాధునిక వైద్య పద్ధతులు



చిన్నపిల్లల్లో హెపటో బ్లాస్టోమా అనే లివర్ క్యాన్సర్లు వస్తున్నాయి. జన్యుపరమైన లోపాలతో వస్తున్న ఈ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్‌లకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్‌లకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్లు, వైద్యసేవలు అందిస్తున్నారు.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



గుంటూరు జీజీహెచ్‌లో లివర్ సమస్యలకు ప్రతిరోజూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నారు. వారంలో మూడు రోజులపాటు ఓపీ విభాగంలో, మూడు రోజుల పాటు వార్డులో లివర్ సంబంధిత సమస్యలకు చికిత్స అందిస్తున్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో 2021లో 4,081 మంది, 2022లో 4,576 మంది, 2023లో 4,892 మంది చికిత్స పొందారు. వీరిలో 20 శాతం మంది లివర్ సంబంధిత వ్యాధి బాధితులే. త్వరలోనే లివర్ మార్పిడి ఆపరేషన్లు సైతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్

త్రివిధ దళాల సైనికుల సేవలు వెలకట్టలేనివి

రాష్ట్ర త్రివిధ దళాల సైనికుల కమిటీ మాజీ ఛైర్మన్ రెడ్డి వరప్రసాద్



అంజిరెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న రెడ్డి వరప్రసాద్, గ్రామస్తులు

రెంటచింతల: దేశ రక్షణ కోసం త్రివిధ దళాల సైనికులు చేస్తున్న సేవలు వెలకట్ట లేనివని రాష్ట్ర త్రివిధ దళాల మాజీ సైనికుల కమిటీ ఛైర్మన్ రెడ్డి శ్రీనివాస వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పశర్లపాడు గ్రామానికి చెందిన వాయుదళ మాజీ సైనికుడు పమ్మి అంజిరెడ్డి (46) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న రాష్ట్ర త్రివిధ దళాల మాజీ సైనికుల కమిటీ ఛైర్మన్ రెడ్డి శ్రీనివాస వరప్రసాద్, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి షేక్ కాలేషాతో పాటు త్రివిధ దళాలకు చెందిన వారు సందర్శించి మృతదేహంపై జాతీయ పతాకాన్ని కప్పి కవాతు ప్రదర్శన ద్వారా ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ సైనికుల జోహార్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఈ సందర్భంగా రెడ్డి శ్రీనివాస వరప్రసాద్ మాట్లాడుతూ అంజిరెడ్డి 20 సంవత్సరాల పాటు వాయుదళంలో ఎంతో అంకిత భావంతో విధులు చేపట్టారని పేర్కొన్నారు. అంజిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సైనిక్ బోర్డు విశ్రాంత ముఖ్య సంచాలకులు బ్రిగేడియర్ వెంకటరెడ్డి, ఐటీ ఇంచార్జి ప్రశాంత్, సంక్షేమ అధికారిణి గుణశీల, కోశాధికారి వంశీకృష్ణ, జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ముఖ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఇన్ కంటాక్స్ ఎస్ఐ కామిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బంగారం మాయం.. ఉద్యోగి ఆత్మహత్య

సంస్థలోనే బంగారం ఉన్నట్లు సిబ్బంది ప్రకటన

కొల్లూరు : బంగారం, వెండి వస్తువులు తాకట్టు పెట్టుకుని నగదు లావాదేవీలు నిర్వహించే ఓ ప్రైవేటు సంస్థలో బంగారం మాయం అవడంతో మనస్తాపానికి గురైన ఆ సంస్థ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా తంబడపల్లెకు చెందిన పిన్నెబోయిన బాలశేఖర్ (21) డిగ్రీ పూర్తయిన అనంతరం మణప్పురం సంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆదరవుగా ఉన్నాడు. గిద్దలూరు, వినుకొండ బ్రాంచ్‌లలో పని చేసిన అతను ఈనెల 12న కొల్లూరు బ్రాంచ్‌కు ట్రాన్స్‌ఫర్‌పై వచ్చాడు. గతంలో కొల్లూరులో పనిచేసిన మేనేజర్ బదిలీ అవడంతో, నూతనంగా వచ్చిన మేనేజర్ సంస్థలో బంగారం నిల్వ లెక్క చూసుకునే సమయంలో ఎనిమిది గ్రాములు కనిపించకుండా పోవడంతో బాలశేఖర్ ఆందోళనకు గురయ్యాడు. మేనేజర్ తిరిగి పరిశీలిద్దాం.. ఉంటుందిలే ! అని నచ్చచెప్పినప్పటికీ, అతని బంధువులకు ఫోన్ చేశాడు. వారు కూడా అవసరమైతే నగదు చెల్లిద్దాం ఆందోళన చెందవద్దని సూచించారు. అయితే, ఆ సంస్థ ఆవరణలోనే ఉన్న గదిలో మేనేజర్‌తో కలసి ఉంటున్న బాలశేఖర్ 23 అర్ధరాత్రి వాంతులు చేసుకుంటుండటంతో ఆయన ఏమైందని ప్రశ్నించారు. బంగారం పోవడంతో నింద తనపై పడుతుందన్న ఆందోళనతో కలుపు మందు తాగినట్లు తెలపడంతో హుటాహుటిన గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున బాలశేఖర్ మృతి చెందాడు. మృతుడి తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, కనిపించకుండా పోయిన ఎనిమిది గ్రాముల బంగారం సంస్థకు చెందిన లాకర్‌లో పేపర్ల కింద ఉన్నట్లు సిబ్బంది తెలిపినట్లు ఏఎస్ఐ అర్జున్ పేర్కొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చినగంజాం: చినగంజాం నుంచి ఉప్పుగుండూరు వెళ్లే మార్గంలో రైల్వే వంతెనకు సుమారు 100 మీటర్ల దూరంలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టని విధంగా కుళ్లి పోయింది. వయస్సు 25 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. శరీరంపై జీన్స్ ప్యాంట్, షర్ట్ దానిపై స్వెట్టర్, స్కార్ఫ్ కూడా ఉంది. చనిపోయి వారం రోజులు అయి ఉంటుందని, రైల్వే పనులు నిమిత్తం వేరే రాష్ట్రం నుంచి వచ్చిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించనున్నట్లు ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు తెలిపారు.

కనుల పండువగా లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

- ఎమ్మెల్యే కాసు, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ పూజలు
- స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పణ



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాసు, అనిల్ కుమార్ యాదవ్

దాచేపల్లి : స్థానిక ముత్యాలంపాడు రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ పూజారి నల్లజర్ల నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి వార్షిక కల్యాణం కన్నుల పండువగా జరిపించారు. అనంతరం కుంకుమ బండ్లను ఊరేగించారు.

పట్టు వస్త్రాలు సమర్పణ

శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి తిరునాళ్ల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి ఆంజనేయులు నివాసం నుంచి అమ్మవారి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్ తీసుకెళ్లారు. మేళ తాళాలతో పట్టు వస్త్రాలను ఊరేగించిన పిదప అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, పార్టీ నేత కొప్పుల సాంబయ్య, మాజీ పట్టణ కన్వీనర్ మునగా పున్నారావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ,, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కందుల జాను, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, నాయకులు దాచేపల్లి సైదారావు, షేక్ ఖాదర్ భాషా, మునగా శ్రీనివాసరావు, కుందురు తిరుపతి రెడ్డి, పొనాది వెంకట నారాయణ, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పెమ్మవారు.. ఇదేంది సారూ..

తాడికొండ: వైఎస్సార్ సీపీ నాయకులు సద్దాం హుస్సేన్‌లా వ్యవహరిస్తున్నారంటూ గుంటూరు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు సద్దాం హుస్సేన్‌లా ప్రవర్తిస్తున్నారని, సద్దాం హుస్సేన్ కూడా తన ఇష్టారీతిగా వ్యవహరించినందునే బంకర్‌లో దాగి ఉన్నా లాక్కొచ్చి కుక్కను కొట్టినట్లు కొట్టి చంపారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ గురించి మాట్లాడకుండా ముస్లిం మనోభావాలను కించపరిచేలా సద్దాం హుస్సేన్ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పెమ్మసాని క్షమాపణ చెప్పాలంటూ కోరారు. పెమ్మసాని పలు కార్యక్రమాల్లో నోటికొచ్చినట్లు మాట్లాడటం పరిపాటిగా మారడంతో ఇప్పటికే ఆయన వైఖరిపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నంబూరు–రెడ్డిపాలెం కేబిన్ వద్ద సుమారు 23 సంవత్సరాల యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి నిడుమర్రు గ్రామానికి చెందిన కొత్తపూగు చిన్న వీరయ్య రెండో కుమారుడు కొత్తపూగు మహేష్ (23) డిగ్రీ పూర్తి చేసి ఓ ప్రైవేట్ సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి మార్చురికి తరలించారు. సోమవారం మృతుడి పేరు కొత్తపూగు మహేష్‌గా గుర్తించిన కుటుంబ సభ్యులు జీఆర్పీ పోలీసులకు సమాచారం తెలియజేశారు.

మహారాష్ట్ర యువకుడు అరెస్ట్

గుజరాత్‌లో అరెస్ట్ చేసిన తెనాలి పోలీసులు

తెనాలిరూరల్: ప్రేమ పేరుతో వంచించి మైనర్ బాలికపై లైంగిక దాడి చేసి గర్భవతిని చేసి పరారైన మహారాష్ట్ర యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వన్ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్ వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన మైనర్ బాలిక షరాఫ్ బజారులోని వస్త్ర దుకాణంలో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తుంది. మహారాష్ట్రకు చెందిన కొందరు యువకులు బంగారు ఆభరణాల తయారీ పనులు చేసేందుకు తెనాలి వచ్చి షరాఫ్ బజార్ ప్రాంతంలోనే గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వీరిలో సోలాపూర్‌కు చెందిన ప్రశాంత్ జగదీష్ ఫడత్రే అలియాస్ ప్రశాంత్ ఫడత్రేకు బాలికతో స్నేహం ఏర్పడింది. తనను ప్రేమిస్తున్నా, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాలిక గర్భందాల్చగా విషయం తెలుసుకున్న అతడు తెనాలి విడిచి పరారయ్యాడు. మోసపోయిన బాలిక జనవరి 29న పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు నిందితుడి ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నించారు. సీఐ జి. దశరథరామారావు నేతృత్వంలో ఎస్ఐ వై. సుబ్బయ్య, ఏఎస్ఐ కె. రత్నరాజు, కానిస్టేబుల్ ఎస్‌కేఎండీ షరీఫ్‌ల బృందం యువకుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టగా సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితుడు గుజరాత్‌లోని భావనగర్‌లో ఉన్నట్టు తెలుసుకున్నారు. అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకుని తెనాలి తీసుకువచ్చారు. సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితుడి ఆచూకీ గుర్తించేందుకు సమర్థవంతంగా పని చేసిన అధికారులు సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌తో కేఎల్‌యూ ఒప్పందం



పత్రాలను చూపుతున్న పార్థసారథి వర్మ, చిత్రంలో ఈసీఈ విభాగాధిపతి

తాడేపల్లి రూరల్ : రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సైబీరియన్ బ్రాంచ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్ టెరెస్ట్రియల్ ఫిజిక్స్ సంస్థతో కేఎల్‌యూ ఈసీఈ విభాగం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కె.పార్థసారథి వర్మ తెలిపారు. తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్‌యూలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరిక్ష వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులపైన పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక రంగంలో పరస్పర సహకారం కోసం ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ఆయన వివరించారు. దీనివల్ల కేఎల్‌యూలోని ఈసీఈ విభాగం అంతరిక్ష వాతావరణంపై దృష్టి సారించి శాస్త్రీయ, విద్యాపరమైన సహకారం కోసం ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. యూనివర్సిటీ, ఐఎస్టీపీ – ఆర్ఏఎస్‌ల మధ్య సన్నిహిత మైత్రిని ఏర్పరచడానికి, ఉమ్మడి శాస్త్ర సాంకేతిక కార్యకలాపాల్ని సులభతరం చేయడానికి అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినట్లు పేర్కొన్నారు. తమ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ డి. వెంకటరత్నం సంబంధిత బృందాలకు నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. జీఎన్ఎస్ఎస్ డేటా మార్పిడి, పరిశోధన సిబ్బంది, ఉమ్మడి ప్రాజెక్టులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు తదితర వాటిపై పరస్పర సహకారం రెండు సంస్థల మధ్య ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. సుమన్, డాక్టర్ ఎం. శ్రీధర్, డాక్టర్ సంపత్ కుమార్ పాండా పాల్గొన్నారు.